# మసాబు వెలుతురు

జోరుగా, హోరుగా వర్షం కురుస్తోంది. ఏడు గంటల సాయంత్రం మల్లే ఉంది, మూడు గంటల మధ్యాహ్నం. ఏడు గంటల సాయంత్రం పట్టణంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే యంత్రం మౌనం వహించిననాటి సాయంత్రం - జిల్లా బోర్డు ఉద్యోగస్థుల ఇళ్ళల్లోకి అపరిమితమైన కిరసనాయిలు కావలసివచ్చిన సాయంత్రం - ఏడుగంటలసాయంత్రపు చీకటిని ధరించి వర్షిస్తున్నది, ఆనాటి మధ్యాహ్నం.

రంగం:

మహానగరంలో అద్దె కొంపలో ఒకగది.

కథాకాలం:

ప్రస్తుతం.

కథానాయకుడు:

రామారావు

రంగస్థలంలో ఏయే వస్తు సముదాయం ఉందో పోల్చుకోలేనంత మసాబు. రామారావు చేతులు వెనక్కు పారవేసి కాళ్లు జమిలి ట్రంకుపెట్టిలదొంతరకి దన్నుపెట్టి పడకకుర్చీలో పడుకొన్నాడు. చుట్టూ చీకటిగాఉన్నా కళ్ళు మూసుకొన్న రామారావులో మసాబు వెల్తురు. రామారావు ఆలోచిస్తున్నాడు.

రామారావుని ఎవరేనా ఎవరికేనా ఎరుకపరుస్తున్నప్పుడు చెప్పే పరిచయవాక్యాలని మనంవింటే అతడి సాంఘిక స్థానాన్ని పోల్చుకోగలం. వంద ఎకరాల పొలం. లక్షల

మీద వ్యాపారం ఉన్న 'బీద' ఇనాందారుడి, 'దేశభక్త' వ్యాపారస్థుడి కుమారుడు రామారావు. ప్రస్తుతం పట్టణంలో చదువుకొంటున్నాడు. ఏ చదువు అని ప్రశ్నించక్కర్లేదు. తండ్రి చావుబతుకులమధ్య మంచాన పడి కొట్టుకొంటున్న సమయందాకా ధనవంతులబిడ్డ చదువుకోవచ్చు. పట్టణాల్లో నివసించవచ్చు.

అందరి ధనవంతుల బిడ్డలమల్లే రామారావు కార్మిక కర్షక జనులబాధని అపారంగా అర్థం చేసుకొన్నాడు. ప్రస్తుతం తండ్రితో వ్యతిరేకించి నెలకి రెండువందల రూపాయలు మాత్రమే తెప్పించుకొంటూ - ఆలోచిస్తున్నాడు.

మసాబు వెల్తురులో అతని కళ్ళముందు కనబడే దృశ్యాలు—ఫాక్టరీలో యంత్రరాక్షసి ఇనుపకోరలలో తన రక్తాన్ని పిండియిచ్చే కార్మిక పతితుడూ, వాడి సంసారం కాదు; మోకాలులోతు బురదలో నడుంవంచి పొలంలో పని చేస్తున్న నిరక్షరాస్య కృషీవలుడూ, వాని సమస్యలూ కావు; రామారావు ఆడపిల్లల కాలేజీ వసతిగృహంలోని రంగురంగుల చీరల హక్కుదారులలో ఒకానొక రెండు కండ్లగురించి ఆలోచిస్తున్నాడు.

వానకురుస్తున్న మధ్యాహ్నం, సాయంత్రంలాంటి చీకటిలో వెచ్చదనం యిచ్చే గరంగరం చా, వేడి వేడి పకోడీలు, తాజాతాజా సిగరెట్టు పీల్పులు, మజా మజా ఆడ పిల్లలు జ్ఞప్తికి వస్తారుగాని పీడితులూ, తాడితులూ మనస్సు

నరాల దూలాలనిప్పుడుని వేళ్ళాడుతూ పీడించరు. రామా రావు ఆలోచిస్తున్నాడు.

ప్రమాణపూర్తిగా చెప్పవచ్చు. మనం పెట్టేబట్టు తీసి గట్టుమీాద పెట్టవలసిన ఆవశ్యకత ఏమాత్రం ఉండబోదు. రామారావు మనోవాక్కాయ కర్మలచేత చరిత్రహీనుల మహాప్రస్థానంద్వారా. నవధరిత్రి శుభచరిత్ర లిఖించేటం దుకు ఉద్యుక్తుడైనమాట అక్షరాలా నిజం. అయినా చలిగా వాన కురుస్తున్న వేళ ఆడపిల్లలు జ్ఞాపకం రావడం పార్టీ డిసిప్లిన్‌కి ఏమాత్రం భంగకరం కానేరదు. అందుకు ఉక్కు పాదాలుసైతం క్షమించగలవు.

ఇంతదాకా రామారావు అవివాహితుడని చెప్పక పోవడం నేరమే. రామారావు తనవివాహం విషయమై ఆలో చిస్తున్నాడని వెంటనే చెప్పివేస్తే ఇంతవరకూ ఏ విషయాన్ని చెప్పక, చేసినటువంటి పాపం పోతుంది. అనుమానం అక్క ర్లేదు, గాంధీజీని కాపాడుకోకుండా చంపిన పాపమే కంచు విగ్రహాలు కడితే పోతున్నదికదా!

పెళ్ళి చేసుకోనమని తండ్రి, పినతండ్రి, తల్లి, మేనత్తా సమయానుకూలంగా అనవసర ప్రస్తావనలు తెచ్చే కుటుంబ బంధు మిత్ర పరివారాలు శతవిధాలపోరేరు. అందుకే అలసి పోయి విద్యావ్యాసంగంనిమిత్తం పట్నం చేరుకొన్నాడు. పెద్దలు నిశ్చయించిన వధువు లక్షరూపాయల కట్నంతో వస్తుంది. కావలసిన సంబంధం. ఈ రెండువాక్యాలు అపా రాన్ని స్ఫురింప చేసేటట్టయితే క్రమాన్ని మార్చినా ఇబ్బంది

లేదు. రామారావు పెద్దలు నిశ్చయించే ఏ సంబంధమైనా అంతకట్నంతో రాకపోదు.

వధువు పల్లెటి ప్రాంతాల మనిషి కాదు. నాగరికతని సంపూర్ణంగా జీవితంలోకి చొప్పించుకొని, ఆడపిల్లల కాలేజీలో చదువుకొంటూ, వసతిగృహంలో నివసిస్తూ రంగురంగుల చీరలు ధరిస్తూ శనాఽదివారాలలో విధిగా సినిమాలు చూస్తూన్న జవ్వని. జవ్వని పట్నవాసంలో చదువుకొంటున్నా అనవసరంగా పెద్దలనిశ్చయాలతో జోక్యంకలిగించుకొనే రకంకాదు. చదువుకి ఫుల్‌స్టాపుపెట్టి, మెడకి మంగళసూత్రాన్ని కట్టించుకొని, డ్రాయింగు రూములో దిళ్ళు సర్దుతూ, లేతరంగు చీరలని నాణ్యంచేస్తూ కొత్తరకం నగలు పురమాయించుతూ కాలక్షేపంచేసేందుకు అడ్డుచెప్పని పిల్ల.

వాస్తవానికి జవ్వని కాలేజీచదువు రామారావుని ఆకర్షించేటందుకే. రెండేళ్ళక్రితం రామారావు అధమం కాలేజీ చదువునైనా అలంకారంగాలేని అమ్మాయిని జీవిత భాగస్వామిని గావించుకొనలేడని అభిప్రాయపడి పెద్దలు అమ్మాయిని చదువులోపెట్టేరు. ఇద్దరూ ఒకేఒక పట్టణంలో నివసించే పక్షాన ఏ కాఫీహోటేలులోనైనా, ఏ సినిమాలో నైనా, ఏబస్సులోనైనా తారసిల్లి మనస్సులవిప్పుకొని ప్రణయంలో పడకపోరని అభిజ్ఞవర్గాలు అనుకున్నారు.

కాఫీహోటలులలోనూ, సినిమాహాలులలోనూ, బస్సులోనూ కాక సెలవలకి మేనమామగారి ఇంటికి రామారావు చుట్టపు చూపుగా వెళ్ళినప్పుడు కలుసుకొన్నారు. రామా

రావు అంతర్జాతీయ పరిస్థితులూ, ముఠా రాజకీయాలూ, వర్గ కలహాలు పురస్కరించుకుని స్థానిక సమ్మెలో ఏ కార్యక్రమాన్ని అమలు పెట్టవలసినదీ, ఏఏ నినాదాలు ఇవ్వవలసినదీ ప్రస్తావించాడు. 'పోనిద్దూ బావా! నీ రాజకీయాలంటే నాకు తలనొప్పి. దయచేసి మరేకబుర్లేనా చెప్పూ' అని జవ్వాని అభిభాషించింది.

కనీసం స్థానిక కమ్మరి పనివాళ్ళ సమ్మెతో నయినా సానుభూతిచూపనిదానిని భార్యగా ఏ కుర్రాడేనా ఎలా అంగీకరించగలడు? అందుకే పట్నానికి తిరిగి వచ్చి ఉన్నతోన్నత విద్యని అభ్యసించుకున్నాడు.

అన్నీ నిజమయినా 'ఈ- ఏడు- గంటల- చీకటి- చలి- మూడు- గంటల' మధ్యాహ్నం పూట ఆలోచించుకుందికి అవేమీ అడ్డు రాలేదు. అతడి కన్నులలోని మసాబు వెల్తురులోని ఆడపిల్లల రంగురంగుచీరల హక్కుదారుల్లో ఒకర్తుక అతడిని చెయ్యిపట్టుకొని ఒక సలక్షణమయిన పెళ్ళి పందిరిలోకి లాక్కెళ్ళింది. వైభవంగా సాగుతున్నది పెళ్ళి. మంత్రఘోష - మేళపు కోలాహలం - తొందర తొట్రుపాటు హడావడి - అమ్మలక్కల హాస్యాలూ, నలుగులు - ఊరేగింపు బాణా సంచా - ఉత్సాహం ఉత్సవం - ఉద్ధృతంగా - రామారావు మసాబు వెల్తురులో వేడికోర్కెలు రేగేయి. ఆ ఒకానొక ఒకర్తుకా తనూ పెళ్ళిపీటలమీద, ముత్యాల పల్లకీలో, పట్టు పరుపులమీద - ఈ మసాబు వెలుతురులో కాక, నిజంగా

విద్యుద్దీపాల ధగధగల్లో, బంధుమిత్రుల కళ్ళల్లో వెలిగే ఆనందపు కిరణాల వెలుతురుల్లో కూర్చోవాలనిపించింది.

రామారావు ఆలోచిస్తున్నాడు. జోరుగా హోరుగా వర్షం కురుస్తోంది. మూడుగంటలకి మొదలుపెట్టిన వర్షం సాయంత్రం ఏడుగంటలకి వెలిసినా రామారావు ఆలోచనలు ఆఖరవలేదు.

అతనిలో మసాబు వెలుతురు అలాగే ఉంది. అనేకానేక మధురోహలు పోతూ మళ్ళా వెనక్కి మళ్ళుతూ అతడు డోలాందోళనలో ఉన్నాడు. జవ్వని ఒకర్తుక అతని మనస్సులో పీట వేసుకుంటున్నది.

మీట నొక్కితే దీపం వెలుగుతుంది అన్న సంగతి మూడు గంటలకే గుర్తుంచుకొంటే ఇంత చీకటిగా ఉండక పోను అన్న సంగతి ఏడుగంటలకి తట్టింది రామారావుకి. లేచి తిమ్మిరెక్కిన కాళ్ళతో కుంటుకుంటూ వెళ్ళి మీట నొక్కేడు.

అతనికి ఆకలేస్తోంది.